మూడు రోజులు భారీ వర్షాలు

ఖిలావరంగల్, జూలై 23: జిల్లాలో రానున్న మూడు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. మోస్తరు నుంచి భారీ వర్షాలు కుస్తాయని, ప్రజలు అవసరమైతేనే బయటకు వెళ్లాలని సూచించింది. మంగళవారం జిల్లావ్యాప్తంగా చిరుజల్లులు పడ్డాయి.

నేడు డయల్ యువర్ డీఎం

హనుమకొండ చౌరస్తా, జూలై 23: హనుమకొండ డిపో పరిధిలోని జమ్మికుంట, వేలేరు, ఐనవోలు, పర్వతగిరి, సంగెం, ఖిలావరంగల్, హనుమకొండ, హసన్‌పర్తి, కమలాపూర్, వరంగల్, కాజీపేట పరిధిలో ప్రయాణికుల కోసం బుధవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డీఎం భూక్యా ధరంసింగ్ తెలిపారు. మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు 9959226049 నంబర్‌కు ఫోన్ చేసి అభిప్రాయాలు తెలియజేయాలని కోరారు.

కలెక్టరేట్‌లో పారిశుధ్య పనులు

ఖిలావరంగల్, జూలై 23: కలెక్టరేట్‌లో మంగళవారం పారిశుధ్య పనులు చేపట్టారు. కార్యాలయం ప్రాంగణంలో చెత్తాచెదారం పేరుకుపోయి అపరిశుభ్రంగా మారాయి. దీంతో వివిధ పనుల నిమిత్తం కలెక్టరేట్‌కు వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో అధికారులు పారిశుధ్య పనులకు శ్రీకారం చుట్టారు.

బల్దియాలో మహిళా శక్తి క్యాంటీన్

వరంగల్, జూలై 23 : గ్రేటర్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో మహిళా శక్తి పథకంలో భాగంగా మహిళా సమాఖ్యకు క్యాంటీన్‌ను కేటాయించారు. మంగళవారం మెప్మా టీపీఆర్వో కోలా రాజేశ్‌కుమార్, టీఎంసీ రమేశ్ క్యాంటీన్‌ను పరిశీలించారు.

రేపటి నుంచి నాటక ప్రదర్శనలు

హనుమకొండ చౌరస్తా, జూలై 23: సురభి 140వ వార్షికోత్సవం సందర్భంగా తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో భానోదయ నాట్యమండలి వారితో హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌లోని పద్మశ్రీ నేరెళ్లవేణుమాధవ్ కళాప్రాంగణంలో గురువారం నుంచి 31 వరకు నాటక ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ నాగబాబు, ఆర్ కోటేశ్వర్‌రావు తెలిపారు. రోజు సాయంత్రం 6.30 నుంచి మాయాబజార్, భక్తప్రహ్లాద, లవకుశ, శ్రీకృష్ణలీలలు, జైపాతాళ భైరవి, బ్రహ్మంగారి చరిత్ర, రావణబ్రహ్మ నాటక ప్రదర్శనలు ఉంటాయని వారు వివరించారు.

డ్రైవర్ సడెన్ బ్రేక్.. పగిలిన అద్దాలు

గిర్మాజీపేట, జూలై 23: వరంగల్ డీమార్ట్ ప్రాంతంలో మంగళవారం బైక్ రావడంతో ఎదురుగా వస్తున్న బస్ డ్రైవర్ సడెన్ బ్రేక్ వేశాడు. దీంతో వెనకాలే వస్తున్న మరో బస్ ముందు భాగానికి తాకింది. ఆ బస్సు ముందు అద్దాలు పగిలాయి. ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఇంతెజార్‌గంజ్ సీఐ మచ్చ శివకుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

పాకాలలో 24 అడుగుల నీరు

ఖానాపురం, జూలై 23: పాకాల సరస్సు నీటిమట్టం మంగళవారం సాయంత్రానికి 24 అడుగులకు చేరుకుంది. వానకాలం పంటలకు సరిపడా నీరు చేరడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

'దళితుల సమస్యలపై చర్చించాలి'

చెన్నారావుపేట, జూలై 23: దళిత, గిరిజనుల సమస్యలపై అసెంబ్లీలో చర్చించాలని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు సాదు నర్సింగరావు కోరారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ ఎస్సీ కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

టూరిజం హబ్‌గా అభివృద్ధి చేస్తాం

- పాకాలకు విదేశీ పర్యాటకులు వచ్చేలా కృషి
- డివిజన్‌లో లోలెవల్ కల్వర్టులపై స్టీల్ బ్రిడ్జిలు నిర్మిస్తాం
- కలెక్టర్ సత్య శారద
- నల్లబెల్లిలో బీసీ హాస్టల్ సందర్శన
- విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని హామీ
- 'నమస్తే తెలంగాణ'కు స్పందన

ఖానాపురం: పాకాల తుంగబంధం తూము లీకేజీని పరిశీలిస్తున్న కలెక్టర్ సత్య శారద

ఖానాపురం, జూలై 23: రానున్న రోజుల్లో పాకాలను టూరిజం హబ్‌గా అభివృద్ధి చేస్తామని కలెక్టర్ సత్య శారద అన్నారు. నర్సంపేట ఆర్డీవో కృష్ణవేణితో కలిసి మంగళవారం ఆమె పాకాలను సందర్శించారు. ముందుగా అశోక్‌నగర్ శివారులోని లోలెవల్ కల్వర్టు, పాకాల తుంగబంధం తూము, మత్తడిని పరిశీలించారు. లీకేజీలతో నీరంతా వృథాగా పోతున్నదని ఐబీ అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. పాకాల నీటిసామర్థ్యం, మత్తడి పడితే ప్రజలు, రైతులకు కలిగే ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. పాకాలలో అరుదైన అటవీ జంతువులు, మొక్కల వివరాలను డీఆర్వో నాగరాజు కలెక్టర్‌కు వివరించారు.

త్వరలోనే పాకాలకు మంచి రోజులు

వరుసగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో పాకాల సరస్సును రెవెన్యూ, ఐబీ అధికారులతో కలిసి సందర్శించినట్లు కలెక్టర్ చెప్పారు. ప్రపంచ మంచినీటి సరస్సుల్లో పాకాల 8వ స్థానం, దేశంలో రెండో స్థానంలో ఉన్నట్లు వెల్లడించారు. త్వరలోనే పాకాలకు మంచి రోజులు రానున్నాయని, విదేశీ పర్యాటకులు సైతం వచ్చేలా అభివృద్ధి చేస్తామన్నారు. పంట కాల్వలకు పడిన గండ్లను వెంటనే పూడ్చాలని ఐబీ అధికారులను ఆదేశించారు. నర్సంపేట డివిజన్‌లోని లోలెవల్ కల్వర్టులపై స్టీల్ బ్రిడ్జిలు నిర్మించేలా కృషి చేస్తానన్నారు. కలెక్టర్ వెంట నర్సంపేట తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఐబీ ఈఈ సాల్వన్‌రాజ్, డీఈ రమేశ్, ఏఈ స్వాతి, ఆర్ఐ సత్యనారాయణ, డీఆర్వో నాగరాజు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

గడువులోగా పనులు పూర్తి చేయాలి

నర్సంపేటరూరల్: నర్సంపేట వైద్య కళాశాల నిర్మాణ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. సర్వాపురం శివారులో నిర్మాణంలో ఉన్న 250 పడకల జిల్లా ఆస్పత్రి, వైద్య కళాశాల నిర్మాణ పనుల పురోగతిని ఆమె పరిశీలించారు. అన్ని బ్లాక్‌ల్లో కొనసాగుతున్న పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ఈ నెల 31లోగా నూతన ఆస్పత్రి నిర్మాణ పనులు పూర్తి చేయాలని టీజీఎంఐడీసీ అధికారులను ఆదేశించారు. బోధన, బోధనేతర సిబ్బంది, మౌలిక వసతులు, పరికరాలు సమకూర్చుకొని వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని వైద్య కళాశాల ప్రిన్సిపాల్ కిషన్‌ను కలెక్టర్ ఆదేశించారు. ఆమె వెంట ఆర్డీవో కృష్ణవేణి, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గోపాల్, డాక్టర్ మనోజ్‌లాల్, టీజీఎంఐడీసీ ఈఈ ప్రసాద్, ఇన్‌చార్జి తహసీల్దార్ రాజేశ్ ఉన్నారు.

నర్సంపేటరూరల్: వైద్య కళాశాల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్

మెరుగైన వైద్య సేవలు అందించాలి

నర్సంపేట: దవాఖానకు వచ్చే వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ సూచించారు. నర్సంపేటలోని ప్రభుత్వ ఆస్పత్రిని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. దవాఖానలోని వివిధ విభాగాలను పరిశీలించారు. సాధారణ ప్రసవాలు జరిగేలా కృషి చేయాలని వైద్యులకు సూచించారు. ఆస్పత్రి పరిసరాలను శుభ్రంగా ఉంచాలని సూపరింటెండెంట్ గోపాల్‌ను ఆదేశించారు. అనంతరం ఫార్మసీని సందర్శించి మందుల స్టాక్, రికార్డులను పరిశీలించి వైద్య సిబ్బందికి సూచనలు చేశారు.

అధికారులపై కలెక్టర్ ఆగ్రహం

నల్లబెల్లి: బీసీ హాస్టల్‌లో మౌలిక వసతులు కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులపై కలెక్టర్ సత్య శారద ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ప్రమాదకరంగా హాస్టల్ భవనం.. ఆందోళనలో విద్యార్థులు' శీర్షికన జూన్ 29న నమస్తే తెలంగాణలో కథనం ప్రచురితమైంది. ఈ మేరకు స్పందించిన ఆమె మండలకేంద్రంలోని బీసీ హాస్టల్‌ను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. శిథిలావస్థకు చేరిన భవనానికి తాత్కాలిక మరమ్మతులు చేసి వసతులు కల్పించేందుకు గత కలెక్టర్ ప్రావీణ్య రూ. 2 లక్షల నిధులు మంజూరు చేశారు. ఈ నిధులతో సక్రమంగా పనులు చేపట్టకపోవడంతో వార్డెన్ రవిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే విచారణ చేపట్టి తమకు నివేదిక ఇవ్వాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అలాగే, నల్లబెల్లిలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. గత కలెక్టర్ మంజూరు చేసిన రూ. 2 లక్షల నిధులతో అంగన్‌వాడీ సెంటర్‌లో చేపట్టిన పనులను పరిశీలించారు. అనంతరం లబ్ధిదారులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. సత్య శారద వెంట తహసీల్దార్ రాజేశ్, ఎంపీడీవో నర్సింహమూర్తి, సోషల్ వెల్ఫేర్ డీఈ రవీందర్, ఎస్సై ప్రశాంత్‌బాబు పాల్గొన్నారు. డిస్ట్రిక్ట్ వెల్ఫేర్ అధికారి హైమావతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఝాన్సీరాణి, ఏపీవో వెంకటనారాయణ ఉన్నారు.

భవన నిర్మాణ పనుల పరిశీలన

కాశీబుగ్గ: వరంగల్ 3వ డివిజన్‌లో నిర్మిస్తున్న ఫెర్టిలైజర్ టెస్టింగ్ ల్యాబ్ భవన నిర్మాణ పనులను గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశించారు. 3వ డివిజన్ రైతు శిక్షణ ప్రాంగణంలో నిర్మిస్తున్న భవన నిర్మాణ పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రూ. 2 కోట్ల వ్యయంతో రైతుల కోసం నిర్మిస్తున్న ఎరువుల పరీక్షల ప్రయోగశాల భవన నిర్మాణ పనులు 80 శాతం పూర్తయ్యాయని కలెక్టర్ అన్నారు. ఆమె వెంట జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉషాదయాళ్, అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్ ఉన్నారు.

మత్తు పదార్థాలను నియంత్రించాలి

ఖిలావరంగల్: జిల్లాలో గంజాయి, మత్తు పదార్థాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలని కలెక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఆమె మత్తు పదార్థాల నియంత్రణపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. విద్యా సంస్థల సమీపంలోని కిరాణా షాపుల వేదికగా గంజాయి విక్రయించే ప్రాంతాల్లో నిఘా పెట్టాలన్నారు. రైల్వేస్టేషన్లు, బస్టాండ్ల పరిసరాల్లో గస్తీ చేపట్టాలని పోలీసులను ఆదేశించారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రభుత్వేతర కళాశాలల నుంచి ఎన్ఎస్ఎస్ వలంటీర్లుగా బృందాలను ఏర్పాటు చేసి డ్రగ్స్ ఇతర వ్యసనాలకు లోను కాకుండా చూడాలన్నారు. రైతులు గంజాయి సాగు చేయకుండా చూడాలని డీఏవో ఉషాదయాళ్‌కు సూచించారు. గంజాయి రవాణా చేస్తే 8712661111 టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. సమీక్షలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, నర్సంపేట, వర్ధన్నపేట ఏసీపీలు కిరణ్‌కుమార్, నర్సయ్య, డీఎంహెచ్‌వో వెంకటరమణ, అసిస్టెంట్ ఎక్సైజ్ అధికారి మురళి పాల్గొన్నారు.

తండాల్లో ఎక్సైజ్ అధికారుల దాడులు

వర్ధన్నపేట/రాయపర్తి, జూలై 23: వర్ధన్నపేట ఎక్సైజ్ పోలీసులు మంగళవారం తండాల్లో గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ స్వరూప మాట్లాడుతూ జిల్లా ఎక్సైజ్ అధికారి నాగేందర్‌రావు ఆదేశాల మేరకు వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలోని డీసీతండా, నీలగిరిస్వామితండా, రాయపర్తి మండలంలోని సుభాష్‌తండాలో దాడులు నిర్వహించామన్నారు. 1300 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి, 25 లీటర్ల సారా, 50 కిలోల బెల్లాన్ని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. బదావత్ లక్ష్మి నుంచి 5 లీటర్ల సారాను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై గంగాధర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్సై శిరీషారెడ్డి, సిబ్బంది వెంకటేశ్, కుమారస్వామి, సురేశ్‌బాబు, రాజయ్య, వీరస్వామి, మానస పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరి ఆత్మహత్య

శ్రీనివాస్(ఫైల్)

నెక్కొండ, జూలై 23: ఆర్థిక ఇబ్బందులతో ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన అప్పల్‌రావుపేటలో జరిగింది. ఎస్సై ఎం.మహేందర్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ముత్తినేని శ్రీనివాస్(56) రుణం తీసుకొని ఇంటిని నిర్మించాడు. దీంతో అప్పులు ఎక్కువై ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. మనస్తాపం చెందిన అతడు మంగళవారం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య పుష్ప, కొడుకు రాజవంశీ ఉన్నారు. రజవంశీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విహారయాత్రలో విషాదం

కొమ్మాలు(ఫైల్)

గిర్మాజీపేట, జూలై 23: తీర్థయాత్రకు వెళ్లిన ఒకరు మృతి చెందిన ఘటన పెరుకవాడలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. పెరుకవాడలోని కాకతీయ పరస్పర సహకార సంఘం సభ్యులు పది రోజుల క్రితం కాశీ విహారయాత్రకు వెళ్లి పుణ్యక్షేత్రాలను సందర్శించారు. తిరుగు ప్రయాణంలో సోమవారం సాయంత్రం సంఘం ఫౌండర్, ప్రస్తుత ప్రధాన కార్యదర్శి గటికె కొమ్మాలుకు విషపురుగు కుట్టింది. దీంతో ఒళ్లంతా దద్దుర్లు వచ్చి అస్వస్థతకు గురయ్యాడు. దగ్గరలోని దవాఖానకు తీసుకెళ్లగా అప్పటికే మరణించాడు. మంగళవారం స్వగృహంలో అంత్యక్రియలు నిర్వహించారు.

ఉద్యోగులను సన్మానిస్తున్న జేడీఎం మల్లేశం

రైతులకు మెరుగైన సేవలు అందించాలి

కాశీబుగ్గ, జూలై 23: వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది రైతులకు మెరుగైన సేవలు అందించాలని మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్ ఎన్నారపు మల్లేశం అన్నారు. వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ కమిటీలో విధులు నిర్వర్తించి బదిలీపై వెళ్తున్న సూపర్‌వైజర్లు ముడిదె శివకుమార్, ఎర్రం రమణ, ఎర్రం వంశీకృష్ణ, భూక్యా వెంకన్ననాయక్, ఏఎంఎస్‌లు మైదం కన్నయ్య, శ్రీనివాసరావు, అటెండర్లు మార్త శ్రీనివాస్, పద్మ, మెహెర్‌బీని మంగళవారం ఆయన సన్మానించారు. కార్యక్రమంలో కార్యదర్శి పోలెపాక నిర్మల, గ్రేడ్-2 కార్యదర్శి శ్రీరామోజు రాము, అసిస్టెంట్ సెక్రటరీ రాజ్‌కుమార్, గంధమల్ల రాజేందర్, సూపర్‌వైజర్లు దాసారపు లక్ష్మీనారాయణ, నల్ల నర్సింగం, వివేక్, సాగర్, నర్సింహనాయక్, వినయ్‌కాంత్, శ్రీకాంత్, గంగాధర్ పాల్గొన్నారు.

26 కిలోల గంజాయి స్వాధీనం

ఖిలావరంగల్, జూలై 23: వరంగల్ శివనగర్ రైల్వేస్టేషన్ వైపున్న ఆటో స్టాండ్ వద్ద మంగళవారం మిల్స్‌కాలనీ పోలీసులు గంజాయిని స్వాధీనం చేసుకొని రవాణా చేస్తున్న ముగ్గురిపై కేసు నమోదు చేశారు. వరంగల్ ఏసీపీ నందిరాం తెలిపిన ప్రకారం.. శివనగర్ రైల్వేస్టేషన్ వైపు మిల్స్‌కాలనీ పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లాకు చెందిన కేశబ్ సేతి(19)తోపాటు మరో మైనర్ ఆటో ఎక్కుతూ అనుమానాస్పదంగా కనిపించారు. వీరి బ్యాగ్‌లను తనిఖీ చేయగా, 26.546 కిలోల గంజాయి ప్యాకెట్లు లభించాయి. వాటిని స్వాధీనం చేసుకొని అరెస్టు చేసి ఠాణాకు తరలించారు. అలాగే, వీరికి గంజాయి విక్రయించిన దీపక్ ప్రధాన్‌పై కూడా ఎస్సై ఎం సురేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏసీపీ తెలిపారు.

రాస్తారోకో చేస్తున్న దివ్యాంగులు

హైవేపై దివ్యాంగుల రాస్తారోకో

వర్ధన్నపేట, జూలై 23: స్థానిక సంస్థల ఎన్నికల్లో దివ్యాంగులకు రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై ఇల్లంద బస్టాండ్ వద్ద రాస్తారోకో చేశారు. వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేశ్ మాట్లాడుతూ ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లోనే దివ్యాంగుల రిజర్వేషన్‌పై తగిన నిర్ణయం తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు షరీఫ్, ఈదయ్య, బాబు, బాలకృష్ణ, మత్స్యగిరి, రాజన్న, లింగారెడ్డి, ముత్తయ్య, వెంకన్న, శేఖర్ పాల్గొన్నారు.

సమీక్షిస్తున్న మేయర్ గుండు సుధారాణి

పారిశుధ్య నిర్వహణ మెరుగుపడాలి

వరంగల్, జూలై 23: గ్రేటర్ వరంగల్ పరిధిలో పారిశుధ్య నిర్వహణ తీరు మెరుగు పడాలని మేయర్ గుండు సుధారాణి సూచించారు. కార్పొరేషన్ కార్యాలయంలో మంగళవారం కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడేతో కలిసి ఆమె పారిశుధ్య నిర్వహణపై సమీక్షించారు. క్షేత్రస్థాయిలో చెత్త కుప్పలను ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. శానిటరీ సూపర్‌వైజర్లు, ఇన్‌స్పెక్టర్లు పర్యవేక్షించాలని సూచించారు. సమీక్షలో సీఎంహెచ్‌వో డాక్టర్ రాజేశ్, ఈఈ సంజయ్‌కుమార్, శానిటరీ సూపర్‌వైజర్లు సాంబయ్య, భాస్కర్, నరేందర్, ఐటీ మేనేజర్ రమేశ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

కుడా వెంచర్ల అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

వరంగల్, జూలై 23: కుడా అభివృద్ధి చేస్తున్న వెంచర్ల పనులను వేగవంతం చేయాలని కుడా వైస్ చైర్మన్, గ్రేటర్ కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే అన్నారు. మంగళవారం కుడా వెంచర్లు మడిపల్లిలోని మా సిటీ, ఉనికిచర్లలోని యుని సిటీని ఆమె క్షేత్రస్థాయిలో పర్యటించి, పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వెంచర్లలో ప్లాట్ల వేలం నిర్వహించిన నేపథ్యంలో మౌలిక వసతులు కల్పించాలన్నారు. మా సిటీలో ఆజంజాహీ మిల్లు కార్మికులు 300 మందికి ప్లాట్లు కేటాయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కుడా పీవో అజిత్‌రెడ్డి, ఈఈ భీమ్‌రావు, పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

నర్సంపేట, జూలై 23: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని నర్సంపేట జూనియర్ సివిల్ జడ్జి శిరీష అన్నారు. నర్సంపేట కోర్టు ఆవరణలో మంగళవారం ఆమె న్యాయవాదులు, కోర్టు ఉద్యోగులతో కలిసి మొక్కలు నాటారు. మొక్కలను పెంచడం వల్ల స్వచ్ఛమైన గాలి వస్తుందని, మొక్కలు నాటడమే కాకుండా వాటిని పెంచాలని సూచించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పుట్టపాక రవి, న్యాయవాదులు తొగరు నర్సింహారెడ్డి, దొంతి సాంబయ్య, నారగోని రమేశ్, సూరయ్య, పాషా, రంగనాథస్వామి, అశోక్, బండి శివ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

గీసుగొండ, జూలై 23: అనారోగ్యంతో బాధపడుతున్న 15వ డివిజన్ అధ్యక్షుడు కందుల శ్రీనివాస్‌రెడ్డిని గొర్రెకుంటలోని ఆయన నివాసంలో మంగళవారం మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. చల్లా వెంట కార్పొరేటర్ ఆకులపల్లి మనోహర్, నాయకులు గోలి రాజయ్య, సుంకరి శివకుమార్, బాలయ్య, శ్రవణ్, అనిల్ ఉన్నారు.

సందేశాత్మక పుస్తకాల బహూకరణ

వరంగల్, జూలై 23: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పుట్టిన రోజు సందర్భంగా బీఆర్ఎస్వీ నాయకుడు పిన్నింటి విజయకుమార్ సందేశాత్మక పుస్తకాలను మంగళవారం ప్రిన్సిపాల్ భుజేందర్‌రెడ్డి సమక్షంలో ఏవీవీ జూనియర్ కళాశాలకు అందజేశారు. పలు వ్యాస రచన, క్విజ్ పోటీల్లో బహుమతులుగా వచ్చిన విలువైన ఈ పుస్తకాలను తెలుగు భాషపై ఆసక్తి ఉన్న విద్యార్థి క్రాంతికి అందజేశారు. అలాగే, క్రికెట్‌లో ప్రతిభ కనబరుస్తున్న ఎల్‌బీ కళాశాల విద్యార్థి పవన్‌కు క్రికెట్ బ్యాట్‌ను అందజేశారు. నక్క వివేక్, అధ్యాపకులు శ్రీనివాస్, నవీన్ పాల్గొన్నారు.

'అలసత్వం వహిస్తే ఉపేక్షించం'

నల్లబెల్లి, జూలై 23: విధుల్లో అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ హెచ్చరించారు. మండలకేంద్రంలోని పీహెచ్‌సీని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి, వైద్య సేవలపై రోగులతో మాట్లాడారు. ప్రతి రోజూ గ్రామాల్లో హెల్త్ క్యాంపులు నిర్వహించాలని సూచించారు. ఆయన వెంట డాక్టర్ ఆచార్య ఉన్నారు.

'ఆశ' యూనియన్ నూతన కమిటీ

లలిత, సంధ్య

నర్సంపేట, జూలై 23: ఆశ కార్యకర్తల యూనియన్(బీఆర్‌టీయూ అనుబంధం) రాష్ట్ర అధ్యక్షురాలు ఆర్.సంతోష, బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు పర్యవేక్షణలో జిల్లా కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షురాలిగా కలువాల లలిత, ప్రధాన కార్యదర్శిగా గోలి సంధ్య ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షురాలిగా పెండోట నాగమణి, సహాయ కార్యదర్శిగా దుండి మహేశ్వరి, కోశాధికారిగా తడుగుల సంధ్య, సభ్యులుగా రాయపూర్ రమ, నీలం పద్మ, పావని ఎన్నికయ్యారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బండారి మంజుల, రాష్ట్ర నాయకులు భవాని, అనిత పాల్గొన్నారు.

గంగదేవిపల్లి సందర్శన

గీసుగొండ, జూలై 23: జాతీయ ఆదర్శ గ్రామమైన గంగదేవిపల్లిని మంగళవారం ఆంధ్రప్రదేశ్‌కు చెందిన రాప్తాడు, బుక్కరాయ సముద్రం, నార్పలపామిడి మండలాల్లోని ఎనిమిది గ్రామాల అభివృద్ధి కమిటీ సభ్యులు రాయలసీమ డెవలప్‌మెంట్ ట్రస్టు సభ్యులు శ్రీనివాసులు, రామాంజనేయులు, రూరల్ డెవలప్‌మెంట్ సభ్యులు లలిత, మల్లికార్జున్ ఆధ్వర్యంలో మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ట్రైనర్ కూసం రాజమౌళి, సునీల గ్రామాభివృద్ధిని వారికి వివరించారు. ప్రజల భాగస్వామ్యం, ప్రభుత్వ సహకారంతో గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసుకున్నట్లు వివరించారు. గ్రామస్తులు వందశాతం పన్నులు చెల్లిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మంచినీటి కమిటీ అధ్యక్షుడు మల్లారెడ్డి, సభ్యులు ఉన్నారు.

ప్రభుత్వ ఆదేశాలను విధిగా పాటించాలి

పెర్కవేడు పాఠశాలలో పనుల పురోగతిని అడిగి తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ సంధ్యారాణి

రాయపర్తి, జూలై 23: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాలను మండలంలో విధులు నిర్వర్తిస్తున్న అధికారులు, రైస్ మిల్లర్లు విధిగా పాటించాలని అదనపు కలెక్టర్ సంధ్యారాణి ఆదేశించారు. మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం ఆమె విస్తృతంగా పర్యటించారు. ముందుగా మండల కేంద్రంలోని పల్లెప్రకృతి వనాన్ని సందర్శించి మొక్కల సంరక్షణ, కలుపు నివారణను వేగవంతం చేయాలన్నారు. పెర్కవేడులో మహిళా సంఘాలు నిర్వహిస్తున్న ఆయిల్ మిల్, మిల్లర్ల సారథ్యంలోని రైస్‌మిల్లులను సందర్శించారు. ధాన్యం, బియ్యం నిల్వలను పరిశీలించి నమోదు చేసుకున్నారు. తర్వాత కొండాపురం, తిర్మలాయపల్లిలోని పాఠశాలలను తనిఖీ చేసి అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. టీఎస్‌డబ్ల్యూఐడీసీ ఏఈ కామిశెట్టి మురళీకృష్ణతో మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో కిషన్‌నాయక్, మండల నోడల్ ఆఫీసర్ ఉండ్రాతి సృజన్ తేజ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు అండగా నిలవాలి: సీపీ

స్టేషన్ ఆవరణలో మొక్క నాటుతున్న సీపీ

మట్టెవాడ, జూలై 23: ఆపదలో పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులకు పోలీసులు అండగా నిలవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా సూచించారు. పోలీస్‌స్టేషన్ల వార్షిక తనిఖీల్లో భాగంగా మంగళవారం ఆయన మట్టెవాడ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ టి.గోపి సీపీకి పూల మొక్క అందించి స్వాగతం పలికారు. అనంతరం స్టేషన్ పరిసరాలు, సీసీ కెమెరాలు, రికార్డులను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. తర్వాత స్టేషన్ ఆవరణలో మొక్క నాటారు. ఆయన వెంట సెంట్రల్‌జోన్ డీసీపీ షేక్ సలీమా, వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్, ఎస్సైలు విఠల్, లచ్చయ్య ఉన్నారు.

'సే నో టు డ్రగ్స్' అంటూ భారీ ఫ్లెక్సీ ఏర్పాటు

గిర్మాజీపేట: జిల్లాను డ్రగ్స్ రహితంగా మార్చడానికి సీపీ ఆదేశాలతో ప్రజల్లో అవగాహన కల్పించేందుకు పోచమ్మ మైదాన్ సెంటర్‌లో 'సే నో టు డ్రగ్స్' అంటూ భారీ ఫ్లెక్సీ ఏర్పాటు చేశామని ఇంతెజార్‌గంజ్ సీఐ మచ్చ శివకుమార్ తెలిపారు. గంజాయి, మత్తు పదార్థాలు సేవిస్తున్నా, ఎవరైనా రవాణా, విక్రయాలు చేపట్టినా 8712584473 నంబర్‌కు కాల్ చేసి తెలియజేయాలని కోరారు.

పరిశుభ్రతతో సీజనల్ వ్యాధులకు చెక్

- తరచూ చేతులను శుభ్రం చేసుకోవాలి
- డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రకాశ్

అవగాహన కల్పిస్తున్న డాక్టర్లు ప్రకాశ్, సుమన్

నెక్కొండ, జూలై 23: ప్రజలు వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించడం వల్ల సీజనల్ వ్యాధులకు చెక్ పెట్టొచ్చని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రకాశ్ అన్నారు. రెడ్లవాడలో వైద్యాధికారి సుమన్ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. భోజనం చేసేటప్పుడు చేతులను శుభ్రం చేసుకోవాలని సూచించారు. పరిసరాల్లో ఈగలు, దోమలు పెరగకుండా నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంక్‌ను క్లోరినేషన్ చేయాలని కార్యదర్శికి సూచించారు. అనంతరం డిప్యూటీ డీఎంహెచ్‌వో తెలంగాణ రెసిడెన్షియల్ స్కూల్‌ను సందర్శించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ మౌనిక, సూపర్‌వైజర్ యాకస్వామి, ఏఎన్ఎంలు స్వప్న, నాగలక్ష్మి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి

చెన్నారావుపేట/పోచమ్మమైదాన్: వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా ప్రజలు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని మండల వైద్యాధికారి సరోజ కోరారు. మండలకేంద్రంతోపాటు ధర్మతండాలో వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీవో శ్రీధర్‌రాజు, సీహెచ్‌వో వెంకటేశ్వరరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. వరంగల్ 22వ డివిజన్ పోచమ్మమైదాన్‌లోని అంగన్‌వాడీ సెంటర్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కార్పొరేటర్ బస్వరాజు కుమారస్వామి హాజరై పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలను కోరారు. దేశాయిపేట అర్బన్ హెల్త్‌సెంటర్ డాక్టర్ తంగళ్లపల్లి భరత్‌కుమార్ పాల్గొన్నారు.

రైతుబీమా కోసం నమోదు చేసుకోవాలి

కాశీబుగ్గ, జూలై 23: కొత్తగా భూమి పట్టా చేసుకున్న రైతులు ఆగస్టు 8 వరకు రైతుబీమా కోసం నమోదు చేసుకోవాలని జేడీఏ ఉషాదయాళ్ కోరారు. 2024-25 సంవత్సరానికి రైతుబీమా ప్రక్రియ ప్రారంభమైందని 1965 ఆగస్టు 14 నుంచి 2006 ఆగస్టు 8వ తేదీ మధ్య జన్మించిన రైతులు అర్హులని పేర్కొన్నారు.

అధికారుల బాధ్యతల స్వీకరణ

నల్లబెల్లి/సంగెం/రాయపర్తి, జూలై 23: నల్లబెల్లి ఎంపీవోగా పసరగొండ రవి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన కూచన ప్రకాశ్ రాయపర్తి మండలానికి బదిలీపై వెళ్లారు. ఖానాపురం నుంచి రవి ఇక్కడకు వచ్చారు. అలాగే, సంగెం మండల వైద్యాధికారిగా వంశీకృష్ణ బాధ్యతలు స్వీకరించారు. ఇన్‌చార్జిగా వ్యవహరించిన పర్వతగిరి వైద్యాధికారి ఉదయ్‌రాజ్ నుంచి ఆయన బాధ్యతలు తీసుకున్నారు. రాయపర్తిలో ఎంపీవో కూచన ప్రకాశ్ విధుల్లో చేరారు.

కవి సింహం దాశరథికి నివాళి

నర్సంపేట, జూలై 23: కవి సింహం దాశరథి శత జయంతి వేడుకలను పట్టణంలోని లీడ్ లైబ్రరీ వ్యవస్థాపకుడు రవికుమార్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా న్విహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన చేసిన రచనలను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ జగదీశ్వర్, టీచర్లు రఘుపతి, రాజు, వీరన్న, రమేశ్ పాల్గొన్నారు.

'ప్లాస్టిక్‌ను నిర్మూలించాలి'

నర్సంపేట, జూలై 23: ప్లాస్టిక్, ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ పదార్థాలను నిర్మూలించాలని డీపీవో శ్రీనివాసరావు అన్నారు. ఆర్డీవో కార్యాలయంలో మంగళవారం జిల్లా వినియోగదారుల ఫోరం సభ్యుల ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నిర్మూలనపై ముద్రించిన అవగాహన కరపత్రాలను ఆవిష్కరించారు.

బీసీ గర్జనను జయప్రయం చేయాలి

కాశీబుగ్గ, జూలై 23: ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ఆగస్టు 6,7వ తేదీల్లో చేపట్టనున్న బీసీ గర్జనను విజయవంతం చేయాలని సంఘం నాయకుడు భరత్ పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలో పోస్టర్ ఆవిష్కరించారు. కేంద్రం బీసీ శాఖ ఏర్పాటు చేసి, విద్యార్థులకు వందశాతం ఫీజు రీయింబర్స్‌మెంట్ అందించాలని డిమాండ్ చేశారు.

చలో ఢిల్లీని విజయవంతం చేయాలి

ఆగస్టు 9న జరుగనున్న చలోఢిల్లీ మాదిగ మహాధర్నాను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కేదాసి మోహన్ పిలుపునిచ్చారు. కాశీబుగ్గ జంక్షన్‌లో కరపత్రం ఆవిష్కరించారు.

మాజీ సర్పంచ్‌కు పెద్ది స్వప్న పరామర్శ

నల్లబెల్లి, జూలై 23: మాజీ సర్పంచ్ గోనె శ్రీదేవిని జడ్పీ మాజీ ఫ్లోర్‌లీడర్ పెద్ది స్వప్న పరామర్శించారు. నాగరాజుపల్లె మాజీ సర్పంచ్ కొద్ది రోజులుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న స్వప్న మంగళవారం ఆమె నివాసానికి చేరుకొని ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

బల్దియా ఎస్ఈ కృష్ణారావు బదిలీ

వరంగల్, జూలై 23 : గ్రేటర్ కార్పొరేషన్ ఎస్ఈ కృష్ణారావు బదిలీ అయ్యారు. ఆయనను గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్‌కు బదిలీ చేస్తూ మంగళవారం మున్సిపల్ ఈఎన్‌సీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈఈ రాజయ్యకు ఎస్ఈగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

'పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి'

చెన్నారావుపేట, జూలై 23: కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్నే అమలు చేయాలని ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి రవిచంద్ర డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం మంగళవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కమిటీని నియమించడం బాధాకరమన్నారు. సీపీఎస్‌తో దేశవ్యాప్తంగా 90 లక్షల ఉద్యోగులు ఎంతో నష్టపోతున్నారని తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME
★I, G.RAVEENDHAR (Old Name). S/o. VENKAIAH, R/o. H.No. 22-8-52, Doctors Colony, Phase - II, Warangal -506002, T.S., That have changed my name as GATLA RAVINDER (New Name), S/o. VENKAIAH.
NTW-0407

CHANGE OF NAME
★I, NIMMANI SANTOSH, S/o. SRIHARI, R/o. H.No. 19-10-207, Shambunipet, Rangashaipet, Warangal Dist.- 506002, T.S., Have changed my name as NIMMANI SANTHOSH, S/o. SRIHARI.
NTW-00

★I, CHAKRAVARTHULA AVINASH, S/o. CHAKRAVARTHULA VENUGOPAL CHARY (Old Name), R/o. Jaggannapet (v), Mulugu(mdl) & Dist.-506343, T.S., Have changed my name as CHAKRAVARTHULA AVINASH, S/o. CHAKRAVARTHULA VENUGOPALA CHARY (New Name).
NTW-00

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
JANGAON
9182777565
MAHABUBABAD
9182777557